www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 డిసెంబర్ 2023
5
చిత్తూరు

రెండవ విడత 'వైఎస్ఆర్ లా నేస్తం' విడుదల

జూనియర్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోండి : జెడ్పీ ఛైర్మన్

లా నేస్తం మెగా చెక్కును అందజేస్తున్న జడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన జూనియర్ న్యాయవాదులకు వైఎస్ఆర్ లా నేస్తం ద్వారా వారి వత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్ళ పాటు ప్రతినెల రూ.5,000లు స్టైఫండ్ అందించడం జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం వెలగపూడి క్యాంప్ కార్యాలయం నుండి రెండవ విడత వైఎస్ఆర్ లా నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లా సచివాలయం నుండి ఈకార్యక్రమానికి జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా ఇంఛార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఐసిడిఎస్ జోనల్ ఛైర్మన్ శైలజారెడ్డి, డిఆర్డిఏ, మెప్మా పిడిలు తులసి, రాధమ్మలు, బిసి కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు నెలకు రూ.5వేలు చొప్పున మూడేళ్లకు రూ.1.80లక్షలు ఒక్కొక్క లబ్ధిదారునికి అందించడం జరుగుతుందని, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ ఆర్థిక సహాయం ఊతమిస్తుందని, ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాని గుర్తుంచుకుని భవిష్యత్తులో పేద వారికి సరియైన న్యాయం అందించడంలో జూనియర్ న్యాయవాదులు సహాయపడాలని కోరారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు ఒకసారి రూ.30వేలును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లా విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్ 2023 నాటికి 97 మంది స్టైఫండ్‌ను అందుకుంటున్నారని, రెండవ విడతగా నవంబర్ 2023కు కొత్తగా 57 మందికి మంజూరు కావడం జరిగిందని, మొత్తం 154 మందికి నెలకు రూ.7.70లక్షలు చొప్పున 6 నెలలకు ఒకసారి నగదును అర్హుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

హడలెత్తిస్తున్న ఏనుగులు

- పంటలపై దాడులు
- 8 గ్రామాల్లో సచారం
- లక్షల్లో పంట నష్టం
- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- వికోట

మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 14 ఏనుగులు గుంపుగా సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాదోళనకు గురిచేస్తున్నాయి. సోమవారం వేకువ జామున గ్రామాల్లో స్వైర విహారం చేస్తూ పంటలను తిని తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు అటవీశాఖ సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ అవి పంట పొలాల్లోకి రావడంతో వాటిని అడ్డుకోలేక వారు చేతులెత్తేశారు. చివరకు గ్రామస్తుల సహకారంతో అటవీ శాఖ సిబ్బంది అరుపులు, డప్పు శబ్దాలతో, టపాకాయలు కాల్చుతూ ఏనుగుల గుంపును అడవిలోనికి మళ్లించారు. గత రెండు నెలలుగా వీకోట, బైరెడ్డిపల్లి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఈ ఏనుగుల గుంపు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దానమయ్యగారిపల్లి, కొమ్మరమడుగు, నక్కనపల్లి, మోట్లపల్లి, బాలేంద్రపల్లి, ఎర్రినాగేపల్లి, వడ్డిపల్లి తదితర గ్రామాలలోని పంట పొలాలపై ఏనుగుల గుంపు చొరబడ్డాయి. ఈ దాడుల్లో టమోటా, బీన్స్, మొక్కజొన్న, అరటి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అప్పులు చేసి పండించిన పంటలు చేతికందే సమయంలో ఏనుగుల వలన దాదాపు రెండు లక్షలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల భారీ నుండి తమకు శాశ్వత పరిష్కారం కల్పించాలని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం సత్వరం అందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పంటల పైకి చొరబడుతున్న ఏనుగుల గుంపు

'ఆడుదాం ఆంధ్రా' ఏర్పాట్లు పూర్తిచేయాలి

ఇంఛార్జి జిల్లా కలెక్టర్ పి.శ్రీనివాసులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్చార్జి కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. ఏర్పాట్లుకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని, అభివద్ధి కార్యక్రమాలకు సంబంధించి డిస్ప్లే బోర్డులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని, ఎన్నికల ప్రక్రియలో క్లైమ్‌లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు అత్యంత జాగ్రత్తగా చేయాలని, అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేసిన ప్రాంతాల్లో ఈకేవైసీ పూర్తిచేయాలని అన్నారు. సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుంచి ఆర్‌డిఓలు, తహశీల్దారులు, ఎంపిడిఒలు, ఈవోపీఆర్డీలు, ఎన్నికలకు సంబంధించిన సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌ను జిల్లా స్పోర్ట్స్ అధికారి బాలాజీ, డిఎల్‌డిఒ రవికుమార్‌లతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు ఇప్పటికే ఆటవస్తువులు క్షేత్రస్థాయిలో చేరుకున్నాయని వాటికి సంబంధించి రిసిప్టులు వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. ఇంకా పెండింగ్ ఉన్న ప్రాంతాలలో పూర్తిచేయాలని అదేవిధంగా క్రీడామైదానాలు పూర్తి చేసుకోవాలని గ్రామవార్డు, అర్బన్ ప్రాంతాలలో ఇంకా పెండింగ్ వున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాలకు సంబంధించి డిస్ప్లే బోర్డుల ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మండలాలలో ఇంకా పూర్తిచేయని అధికారులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో మార్పులు చేర్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు వ్యవహరించడం చేయాలని లేనిపక్షంలో చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రధానంగా ఫారం- 7 విషయంలో అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు, వెళ్లిన వారి క్లైమ్‌ల విషయంలో నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేసి ఈకేవైసీ కార్యక్రమం వెంటనే పూర్తిచేయాలన్నారు. మంగళవారం సాయంత్రం లోపున పూర్తి చేయాలని, ఫ్రీ హోల్డ్ రైట్ విషయంలో వీఆర్‌ఒలు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో అందరూ పాల్గొనేలా చూడాలి : సాప్ కార్యదర్శి

ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని, క్రీడా సామాగ్రి చేరగానే అప్‌లోడ్ చేయాలి అని యువజన సర్వీసుల, టూరిజం కల్చర్ క్రీడల ప్రధాన కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న అన్నారు. సోమవారం రాజధాని నుంచి జిల్లా కలెక్టర్‌లు, జిల్లా క్రీడాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రిజిస్టేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అన్ని క్రీడలలో మహిళలు ఉండేటట్లు చూడాలన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల నుంచి క్రీడా సామాగ్రి క్షేత్రస్థాయికి వెళు తున్నాయని చేరగానే ఆన్‌లైన్ రీసిప్ట్ పంపాలన్నారు. అదేవిధంగా మండల స్థాయి, నియోజకవర్గాల స్థాయిలకు సంబంధించి క్రీడాసామాగ్రి చేరికకు సంబంధించిన సమాచారం అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో క్రీడామైదానాలు పూర్తిస్థాయిలో పరిశీలించి ఆటలకు సరిపోయేలా వుండేటట్లు చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు నుంచి ఇంఛార్జి జిల్లా కలెక్టర్ పి.శ్రీనివాసులు, స్పోర్ట్స్ అధికారి బాలాజీ, డిఎల్‌డిఒ రవి పాల్గొన్నారు.

స్పందనకు 383 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో ఇంఛార్జి జిల్లా కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఇంఛార్జి డిఆర్ఓ శివయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి ప్రసన్న జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 383 అర్జీలు రాగా శాఖలవారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూశాఖకు సంబంధించి 299, మండల లెవెల్ కో ఆర్డినేటర్ కమిటీ 8, జిల్లా ఉపాధి కల్పనశాఖ 1, జిల్లా వాటర్ రిసోర్స్ శాఖ 2, జిల్లా రిజిస్ట్రేషన్ తిరుపతి1, సిఈఓ జెడ్పి చిత్తూరు 1, ఏడి సర్వే 7, డిఈఓ 4, ఎంపిడిఓ చిత్తూరు 1, ఎంపిడిఓ గుడిపాల 1, ఎంపిడిఓ పులిచెర్ల1, ఎంపిడిఓ పెనుమూరు 1, ఎంఈవో గంగవరం 1, నగరపాలక సంస్థ చిత్తూరు 4, నగర పాలక సంస్థ పుంగనూరు 1, పిఓఎస్ఎస్ఏ 3, ఎపిఎస్ పిడిసిఎల్ 10, డిసిహెచ్ఎస్ 1, డిఎస్ఓ 2, సోషల్ వెల్ఫర్‌శాఖ 1, డిఎల్‌డిఓ 3, ఎండోమెంట్ శాఖ 2, ఎస్ఇఆర్ డబ్ల్యూఎస్ 3, మైన్స్‌శాఖ 1, డిఎస్‌ఓ 3, డిఆర్‌డిఏ 4, పోలీసు శాఖ 6, డిఎంహెచ్ఓ 1, ఎపిఎస్ ఆర్‌టిసి 1, డిఎస్‌పి పలమనేరు 1, డ్వామా 1, ఎస్ఇ ఇరిగేషన్ 1, హౌసింగ్ శాఖ 6 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు ఇంఛార్జి జిల్లా కలెక్టర్‌కు తమ వినతులను అందజేశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద జిల్లా అధికారులు సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

ఫిర్యాదుల స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి వై.రిషాంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, ఎస్ఇబి అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సబంధిత అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో మొత్తం 28 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అవి చీటింగ్ 1, కుటుంబతగాదాలు 6, వేధింపులు 2, ఇంటి తగాదాలు 2, భర్త వేధింపులు 2, భూతగాదాలు - 11, ఆస్తి తగాదాలు 4 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

స్పందన కార్యక్రమంలో మూడు వినతులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు.. సహాయ కమిషనర్ గోవర్ధన్ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మెప్మా 2, ప్రజారోగ్య విభాగం 1 చొప్పున మొత్తం మూడు వినతులు అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తుపాను బాధిత ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి

యుద్ధప్రాతిపదిక సహాయ చర్యలు అందిస్తున్నాం : ఆర్కేరోజా
గుండ్రాజుకుప్పం చెరువు లీకేజీ అరికట్టాలంటూ ఆదేశాలు

ప్రజాశక్తి- నగరి: మండలంలోని గుండ్రాజుకుప్పం, గుండ్రాజుకుప్పం దళితవాడ గ్రామాల్లో తుపాను బాధిత ప్రాంతాలను మంత్రి ఆర్కేరోజా సోమవారం పరిశీలించారు. తుపాను తాకిడికి గుండ్రాజుకుప్పం చెరువు తూము పాక్షికంగా దెబ్బతినడంతో నీరు లీకేజీ అవుతుండటాన్ని అధికారులతో పాటు పరిశీలించిన ఆమె తూముకు వెంటనే మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టాలని అదేశించారు. మరోసారి తుపాను వచ్చే అవకాశం ఉందంటూ సమాచారం వస్తున్నందున చెరువు కట్టలు, తూములను పరిశీలించి వాటిని పటిష్టం చేయాలంటూ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా తుపాను బాధిత ప్రాంతాల్లో ఇప్పటికే తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అత్యవసర సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఛిద్రమైన రోడ్లను యుద్దప్రాతిపధికన బాగుచేయడం జరిగిందన్నారు. చెరువు తూము పాక్షికంగా దెబ్బతినిందని దాని మరమ్మత్తులు కూడా త్వరితగతిన చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శివారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ఈ మురళీ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ రాజగోపాల్ రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ బాలప్రసాద్, నాయకులు గోవర్ధన్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణాలు అరచేతిలో పట్టుకుని జీవిస్తున్నాం'

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జగనన్న కాలనీ లబ్ధిదారులు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని జగనన్న కాలనీవాసులు తహశీల్దార్ ఇన్బనాధన్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మండలంలోని పెద్దకాలువ పంచాయతీ ఎల్లమరాజుపల్లి బస్టాప్‌కు ఎదురుగా ఉన్న గుట్టపై జగనన్న హౌసింగ్ స్కీమ్ కింద అర్హులకు ఇళ్లపట్టాలు ఇచ్చారు. అయితే సమీపంలోనే క్వారీ నుంచి భారీపేలుళ్లకు తమ ఇల్లులు సైతం దెబ్బతినడంతో పాటు రాళ్లు వచ్చి పడుతున్నాయని వాపోయారు. క్వారీ పక్కనే ఉండటంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించడం చాలా కష్టంగా ఉందని తెలిపారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఈ సమస్యపై ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు.

మాతాశిశు మరణాలపై దృష్టి సారించండి...

డాక్టర్ అనిల్ కుమార్ నాయక్

ప్రజాశక్తి- యాదమరి: మిషన్ ఇంద్రధనస్సు ప్రత్యేకవ్యాక్సిన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం యాదమరి మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామంలో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ సిహెచ్ఓ లక్ష్మినారాయణలు ప్రజలతో మాట్లాడుతూ మాతాశిశు మరణాలు పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అయితే ఈ కార్యక్రమంలో కూడా సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించుకొని అర్హులైన చిన్నారులు గర్భవతులను గుర్తించి వారికి మిషన్ ఇంద్రధనస్సు అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా మూడు నెలలపాటు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది సర్వే నిర్వహించారని, ఈసర్వేలో కూడా నమోదు కాని వారు ఎవరైనా ఉంటే ఈ ప్రత్యేక డ్రైవ్‌లో వ్యాక్సినేషన్ వేయించుకోవాలని వారు కోరారు. చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవడం వలన వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, దీనివల్ల వివిధ రకాలజబ్బుల భారినపడకుండా రక్షించబడతారని వారు వివరించారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 13, 16వ తేదీల్లో ఈ ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తారన్నారు. ఈకార్యక్రమంలో సిహెచ్ లక్ష్మినారాయణ, ఏఎన్ఎంలు, సూపర్వైజర్స్ ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'డైట్'లో అలరించిన కళా ఉత్సవ్ పోటీలు

కళాఉత్సవ్ పోటీల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు విద్యార్థుల ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా డైట్ సీనియర్ ఆధ్యాపకులు ప్రభాకర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాఉత్సవ్ నిర్వాహక డైట్ అధ్యాపకులు నిర్మల, సునీతలు పోటీలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సజనాత్మకతను, నైపుణ్యాల ప్రతిభను వెలికి తీసి ప్రోత్సాహించడానికి ప్రతిఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వం కళాఉత్సవ్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత నేపథ్యం కలిగిన విద్యార్థులు జానపద, సంగీత, నాటక, ఏకపాత్రాభినయం పోటీలలో చక్కటి ప్రదర్శనలు చేపట్టడం పట్ల విద్యార్థులను అభినందించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 8అంశాలలో విద్యార్థులు పోటీలలోపాల్గొన్నారు. జిల్లా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రసంశా పత్రాలు అందించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, దేవప్రసాద్, మహ్మద్ రఫీ, నాగరాజు నాయక్, అనిత, మోడల్ పాఠశాల మాజీ హెచ్ఎం గాజుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరి కోర్టుకు హాజరైన జీవిత

కోర్టు ఆవరణలో నటి జీవిత

ప్రజాశక్తి- నగరి : ప్రముఖ నటి, దర్శకురాలు జీవిత రాజశేఖర్ సోమవారం నగరి కోర్టుకు హాజరయ్యారు. గరుడవేగ చిత్రనిర్మాణానికి గాను జరిగిన ఆర్థిక లావాదేవీల్లో నటి జీవిత అందించిన చెక్కులు బౌన్స్ అయ్యాయంటూ నగరి నియోజకవర్గం విజయపురం మండలం, మహారాజపురంలోని సాయిశక్తి ఇంజనీరింగ్ కళాశాల యజమాని కోటీశ్వర్‌రాజు భార్య హేమరాజు నగరి కోర్టులో కేసు వేసిన సంగతి విధితమే. ఈ కేసు సుమారు రెండేళ్లుగా నగరి కోర్టులో నడుస్తోంది. కేసును పునర్విచారించాలంటూ జీవిత వేసిన రీకాల్ పిటిషన్‌ను సోమవారం జడ్జి విష్ణువర్మ డిస్మిస్ చేస్తూ అయిన ఖర్చులకు 10వేలు కట్టాలని ఆదేశించినట్లు హేమరాజు తరపు న్యాయవాది మురళీధర్ పేర్కొన్నారు. అయితే సాక్షిగా తనను విచారించాలని జీవిత కోరడంతో కేసును ఈనెల 18వ తేదీకి వాయిదా వేశారు.

నష్టపోయిన రైతులకు విత్తనాలు



ప్రజాశక్తి చిత్తూరు, చిత్తూరుఅర్బన్: అత్యంత పారదర్శకంగా క్షేత్రస్థాయిలో నష్టానికి సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రకియను పూర్తి చేయడం జరిగిందనని ఇంఛార్జి జిల్లాకలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయశాఖ చీఫ్ సెక్రటరీ జికే.ద్వివేది, స్పెషల్ కమిషనర్ హరికిరణ్‌లు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ఇంఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాల్లో 125 గ్రామాల్లో పంటనష్టం జరిగిందని, ఇందులో 619 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు నష్టపోయారని తెలిపారు. అదేవిధంగా రబీ సీజన్‌కు సంభందించి 215హెక్టార్లలో నష్టపోవడం జరిగిందనీ ఈ పంటలో ప్రత్యామ్నాయంగా పంటలు వేసుకోవడానికి 80శాతం సబ్సిడీ కింద ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఉద్యాన పంటలు 32 హెక్టార్లలో నష్టపోవడం జరిగిందనీ దీనికి సంబంధించి నివేదికలు పంపడం జరిగిందన్నారు. అత్యంత పారదర్శకంగా క్షేత్రస్థాయిలో నష్టానికి సంబంధించి ఎన్యూమరేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ ఇంకా ఇతర వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఏమైనా నష్టం కలిగి ఉంటే ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేట జెడ్‌పి హైస్కూల్‌లో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ సందర్భంగా హుమన్ రైట్స్ ఫౌండేషన్, వైఆర్‌డిఎస్ సంస్థ ప్రెసిడెంట్ ఎం.భారతి అధ్వర్యంలో డివైఈఓ చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కరుణాకరన్ మాట్లాడుతూ అర్టికల్ 21 గురించి, మానవ హక్కుల - ఆవిర్భావం గూర్చి వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ హక్కులు, చట్టాలను గురించి ప్రజలు, విద్యార్థులు తెలుసుకుని వాటి ద్వారా అభివద్ధి చెందాలని, చట్టాలను పరిరక్షించుకోవాలని తెలిపారు. అనంతరం అనేక సేవకార్యక్రమాలు చేస్తున్న అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ఆర్గన్సింగ్ అధ్యక్షులు ధనరాజ్ రాబర్ట్, సదురు సంస్థ జిల్లా అధ్యక్షులు శ్రీరంగంపల్లె మునస్వామిను, హ్యూమన్ రైట్స్ పౌండేషన్ సంస్థ అధ్యక్షురాలు యం.భారతి అవార్డ్స్ సంస్థ కార్యదర్శి రవికుమార్‌ను జడ్జి సన్మానించారు. ఈకార్యక్రమంలో జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం మోహన్, స్వేరోస్ సంస్థ రాష్ట్ర కోశాధికారి వినోద్‌కుమార్, సామాజిక సేవాకార్యకర్తలు స్టెల్లా మేరీ, పి.మురళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్

27 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

- అసిస్టెంట్ కమిషనర్‌కు సమ్మె నోటీసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా 27 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టడానికి రాష్ట్ర జేఏసీ సంఘం పిలుపు ఇవ్వడం జరిగిందని యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగరాజు తెలిపారు. అందులో భాగంగానే చిత్తూర్ నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌కి హెల్త్ ఆఫీసర్‌కి సమ్మెనోటీసు సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు విసీ గోపీనాథ్, కే.మణి, దాసరి చంద్ర, కే.రమాదేవి నాయకులు జయశంకర్, వినాయక, చిరంజీవి, సుగుణ, సుకన్య, ఈశ్వర రమణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చిత్తూరు శాఖ పరిధిలోని రక్తదాన శిబిరంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్ క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టాఫ్ నర్స్ ఒక్క పోస్టుకు బీఎస్సీ నర్సింగ్ కంప్యూటర్ ప్రావీణ్యం కలిగి ఉండాలని, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు డిఎంఎల్‌టి కంప్యూటర్ ప్రావీణ్యం పారామెడికల్ బోర్డు నందు రిజిస్ట్రేషన్ పొంది ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పేరుతో దరఖాస్తులు పంపాలని కోరారు.

కమిషనర్‌ను కలిసిన ఆర్టీఐ యూనియన్ సభ్యులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: విజయవాడలో రాష్ట్ర ఆర్టీఐ ప్రధాన కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా, అదేవిధంగా ఆ శాఖ కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డిలను సోమవారం పలువురు యూనియన్ సభ్యులతో పాటు ఆర్టీఐ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీఐ యూనియన్ అధ్యక్షుడు వినోద్ కుమార్, జాతీయ యూనియన్ ఉపాధ్యక్షుడు మోహన్ కుమార్, జాతీయ యూనియన్ బోర్డు చైర్మన్ రాంప్రకాష్, జాతీయ బోర్డు యూనియన్ సభ్యులు జ్యోతి ప్రకాష్, శంకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి రాజీనామా చేయాలి : ఎస్.టి.యు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: ప్రభుత్వ యంత్రాంగంలో పునాది రాళ్ళలా పనిచేసే ఉద్యోగ,ఉపాధ్యాయులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేని ఆర్థికమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని ఎస్.టి.యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ, అనంతపురం జిల్లాలో ఒక టీచర్, జీతాల సమస్య కారణంగా ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సమస్యలపై,అధికారుల విపరీత పోకడలపై పిడికిలి బిగించి పోరాడాలే తప్ప పిరికితనం ప్రదర్శించరాదన్నారు. ఇప్పటికైనా భజన సంఘాలు, పైరవీల సంఘాలు, ఉద్యమ సంఘాలతో కలసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల,ఉపాధ్యాయుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీలు ఇప్పటికైనా నోరు విప్పాలని కోరారు. సక్రమంగా జీతాలు అందక, ఉద్యోగులు, ఉపాధ్యాయులు బ్యాంకుల దృష్టిలో ఎగవేతదారులుగా ముద్రపడుతున్నారని, పలు అవమానాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వృద్దాప్యంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పెన్షనర్ల తిప్పలు వర్ణనాతీతమన్నారు. నెలల తరబడి జీతాలు అందని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను పలకరిస్తే, అధికారులకు క్షేత్ర స్థాయి సమస్యలు తెలుస్తాయన్నారు. లక్షల్లో ప్రజాధనం వినియోగించే సలహాదారులు కళ్ళు తెరిచి, సమస్యలు చూసి, సిఎం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, నష్ట నివారణ చర్యలు తీసుకోకపోతే, ఉద్యమాలు తీవ్రస్థాయిలో జరుగుతాయని హెచ్చరించారు.

కంటి శస్త్ర చికిత్సకు 31 మంది ఎంపిక

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కంటి శస్త్ర చికిత్సకు 31 మంది ఎంపికైనట్టు శంకర్ నేత్రాలయ అధికారి మురళి అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో చెన్నై శంకర్ నేత్రాలయ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 55 మంది కంటి పరీక్షలు చేసుకోగా 31 మందికి కంటి సమస్యలను గుర్తించామన్నారు. వారికి చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్‌లో ఉచితముగా కంటి చికిత్స నిరసిస్తున్నట్టు తెలిపారు. వీరికి చెన్నైకి రాను పోను ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నేత్రాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-గుడుపల్లి: చిత్తూరు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం గుడుపల్లి మండలంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వై.రెడ్డిరాము, డాక్టర్ నాగమణి, చిరుధాన్యాల సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుడుపల్లి మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడతూ రాబోయే కాలంలో డ్రోన్‌ల ఆవశ్యకతను చిరు ధాన్యాల విలువ జోడింపు, పంటకోత అనంతరం చేపట్ట వలసిన చర్యలను రైతులకి సుచించారు. అనంతరం శాస్త్రవేత్తలు పంటపొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఊరూరా ప్రచారం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల చప్పిడిపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో గణేష్ యాదవ్ నాయకత్వం బలోపేతం చేసేందుకు ప్రచార రథతో సోమవారం ప్రచారం నిర్వహించడం జరిగింది. రాబోయే రోజుల్లో పలమనేరు నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడానికి గణేష్ యాదవ్ ముందు వరుసలో ఉన్నారని తెలియజేస్తున్నామని గణేష్ యాదవ్ ప్రచార కార్యదర్శి వేణు తెలిపారు.

ఘనంగా డాక్టర్ అకుల గజేంద్ర ప్రసాద్ 54వ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: చిత్తూరు జిల్లా పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం అధ్వర్యంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ అకులగజేంద్ర ప్రసాద్ 54వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పలమనేరు పట్టణంలోని శ్రీ కృష్ణ దేవ రాయలు విగ్రహం వద్ద సోమవారం బలిజ అభ్యుదయ సేవా సంఘం నాయకులు ఆయన విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆశీస్సులు కోసం ఆయన నివాసానికి చేరుకొని మంత్రి కుటుంబ సభ్యుల నుండి ఆశీస్సు లుతో దీవెనలు అందుకున్నట్లు తెలి పారు. బడుగు బలహీన వర్గాల కోసం అన్నదాన కార్యక్రమం చేపడు తున్నాని మీడియాతో తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి చైర్మన్ సుధాకర్. కిషోర్, అములు, పూల వేణు, కోటి, శ్రీధర్‌తో పాటు పలమనేరు నియోజవర్గంలోని బలిజ అభ్యుదయ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పతకం సాధించి.. ప్రశంసలు పొంది

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎ. చంద్రబాబు తిరుపతిలో జరిగిన 42వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ 2023 పోటీలలో పాల్గొన్నారు. ఐదు కిలోమీటర్లు 800 మీటర్లు రెండు విభాగాల్లో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద సోమవారం ప్రశంసిస్తూ ప్రతి ఒక్కరూ దైనిందని చర్యలో భాగంగా వ్యాయామం చేయాలని గ్రౌండ్‌కు వెళ్లాలని విద్యార్థులందరికీ క్రీడల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎ.సి.భరణినాథ్ రెడ్డి, ఇతర అధ్యాపక అధ్యాపకేత్ర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే.. టీడీపీ రావాలి'

- పూతలపట్టు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మురళీమోహన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ మురళిమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని బంగారుపాళ్యం దళితవాడలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రవేశపెట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లోకనాథంనాయుడు, మాజీ సర్పంచ్ కోదండయాదవ్, నాయకులు రమేష్, వంశి చౌదరి, హరీష్, బాషా, రాధిక, నాసిర్‌ఖాన్, సుదర్శనంనాయుడు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన అలివేలు మంగమ్మ

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పంలో చంద్రబాబు నాయుడును వచ్చే ఎన్నికలలో లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించేందుకు నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త కృషి చేయాలని నారా లోకేష్ సూచించినట్లు చిత్తూరు జిల్లా తెలుగు మహిళ మాజి ఉపాధ్యక్షురాలు, రామకుప్పం మాజి ఎంపిటిసి అలివేలు మంగమ్మ తెలిపారు. సోమవారం కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో నియోజకవర్గ ఇంచార్జ్ యనమల దివ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధిని ప్రతి కుటుంబానికి వివరించి రాబోయే ఎన్నికల్లో టీడిపి విజయానికి కార్యకర్తలు సమిష్టిగా పోరాడాలని లోకేష్ తెలిపారని ఆమె పేర్కొన్నారు.

'ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌ది'

- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాలేరు సచివాలయంలో సర్పంచ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మాట్లాడుతూ పాలేరు సచివాలయానికి దాదాపు 31 కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని ప్రతి లబ్ధదారుడు సంక్షేమ ఫలాల అర్హత ఉండి సచివాలయంలో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి అందడం జరిగిందని సచివాలయంలోని లబ్ధిదారులు ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలు పొందిన వారే అన్నారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వివరాల పట్టికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీ ష్‌రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, ఏఎం సి ఉపాధ్యక్షులు సర్దార్, నాయకులు శివారెడ్డి, దామోదర్‌రెడ్డి, బాలాజీ, లోకనాథం పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల సందర్శన



ప్రజాశక్తి- యాదమరి: ఇంటర్ మీడియట్ రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ జివి.ప్రభాకర్‌రెడ్డి కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌ను సోమవారం సందర్శించారు. మార్చిలో జరిగే ఇంటర్ మీడియట్ పరీక్షల తర్ఫీదుకు సంబంధించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం పరీక్ష కేంద్రాలకు కావాలసిన మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎపి.లలిత, భాస్కర్‌రెడ్డి, దామోదరరెడ్డి, కనకాచారి, మధుసూధన్, మదన్ మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాతృ భాషను మరువద్దు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మన భారత దేశం బహుభాషలకు నిలయమని భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటిస్తూ భారతీయ భాషలపై నేటి విద్యార్థులు పట్టు సాధించాలని అయితే మాతృభాషను మరవద్దని ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ భారతీయ కవి సుబ్రమణ్య భారతి జయంతి సందర్భంగా పాఠశాలల్లో భారతీయ భాషోత్సవం -2023 నిర్వహణలో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన 22 భాషలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సుబ్రమణ్య భారతి సాహితీ ప్రస్థానంతో పాటు వివిధ భాషల్లో ప్రసిద్ధి చెందిన పలువురు కవులు, రచయితలు భాషా సేవలను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం యువశ్రీ మురళి, సురేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళుతూ భక్తురాలు మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: దైవదర్శనానికి బస్సులో బయలుదేరి మార్గమధ్యంలో ఓ భక్తురాలు ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన సోమవారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంకు చెందిన మాయాదేవి (39) ఓం శక్తి మాల ధరించింది. సోమవారం ఉదయాన్నే దైవదర్శనార్థం తమిళనాడులోని మేలు మలత్తూరుకు బస్సులో బయలుదేరారు. బస్సు చౌడేపల్లి పట్టణం దాటగానే అకస్మాత్తుగా మాయాదేవి బస్సులో పడిపోయింది. సహచర భక్తులు గుర్తించి పలకరించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆమె మృతి పట్ల బత్తలాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గుండెపోటుకు గురై మృతి చెందినట్లు పలువురు భావిస్తున్నారు.

కాలం కలిసొచ్చేనా.. టికెట్ వరించేనా.!

ఇనాళ్లు ఆ ఇన్‌ఛార్జ్‌ల వ్యవహారాలు, కార్యక్రమాలు వేర్వేరు.. ఒకరేమో వ్యాపార నేపథ్యం.. మరొకరిదేమో పోరాట సిద్ధాంతం. ఎవరి పార్టీ కార్యక్రమాల్లో వారు బిజిబిజీగా తమదైన శైలిలో ముందుకు సాగారు టీడీపీ, జనసేన పార్టీల జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు. ఉమ్మడి కార్యచరణకు ఇరుపార్టీల అధిష్టానం పిలుపునివ్వడంతో ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఆశలు పెట్టుకున్న ఇరువురిలోనూ సందిగ్ధత నెలకొంది. ఉమ్మడి ఆత్మీయ సమావేశం నిర్వహించి ఒక్కటైనా పార్టీ కార్యకలాపాలు, ప్రచారాల్లో ఎవరికి వారు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. టికెట్ తమకే దక్కుతుందని ఎవరికి వారు చెప్పుకుంటున్నారు. దీంతో ఇరుపార్టీల క్యాడర్ కూడా అయోమయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాశక్తి-వెదురుకుప్పం

- జీడీ నెల్లూరులో ఇంకా ఖరారు కాని ఉమ్మడి అభ్యర్థి పేరు
- అయోమయంలో టీడీపీ, జనసేన పార్టీ కేడర్
- ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై సందిగ్ధత



నియోజకవర్గంలోని మండలాలు ఇవీ..

- వెదురుకుప్పం
- శ్రీరంగరాజపురం
- కార్వేటినగరం
- పెనుమూరు
- పాలసముద్రం
- గంగాధరనెల్లూరు

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజవర్గం రాజకీయంగా ప్రధాన్యతను సంతరించుకొంది. హేమా హేమీలు ఇక్కడ నుంచి జిల్లా రాజకీయలలో కీలకంగా వ్యవహరిం చారు. కుతూహలమ్మ వంటి చెప్పు కోదగ్గ నేతలు వెలుగువెలిగారు. ప్రస్తుతం ఇక్కడ నుంచే రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కలత్తూరు నారాయణ స్వామి కొనసాగు తున్నారు. రెండు పర్యాయాలుగా ఈ యన శాసన సభ స్థానం నుంచి గెలు పొందారు. వైసీపీ టికెట్ మాట పక్కనబెడితే.. టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి పేరు ఖరారు కాక పోవడంపై ఆ పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డారు. ఈ దఫా ఇరుపార్టీలు ఉమ్మడిగా పోటీ చేయాలని నిర్ణయించి క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. కాగా ఇటీవల ఇరుపార్టీల ఆత్మీయ సమావేశం కూడా నిర్వహించారు. ఇప్పటి దాకా జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా డాక్టర్ థామస్ వ్యవహరించగా, జనసేన పార్టీ నుంచి పొన్నా యుగంధర్ బాధ్యత నిర్వర్తించారు. ఇనాళ్లు శాసనసభ స్థానంపై ఆశలు పెట్టుకొని పార్టీల కార్యకలాపాలు నడు పుకుంటూ వెళ్లారు. ఇరుపార్టీల కలయికతో వారిలో అభ్యర్థిత్వంపై ఇప్పుడు తర్జనభర్జన పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇరు పార్టీలు వేర్వేరుగా ప్రచారాలు, పరామర్శలు, పలకరిపులకు వెళుతున్నారు. ఒకింత ఇరువురి మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. గ్రామాల పర్యటనలో ఎవరికి వారు టికెట్ తమదేనని చెబుతున్నట్లు సమాచారం. ఇరు పార్టీ శ్రేణులు కలిసి ప్రచారం చేస్తున్నట్లు పెద్దగా కనిపించడం లేదు. దీంతో జీడీ నెల్లూరులో ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఒకింత సందిగ్ధత నెలకొంది.

వ్యాపార నేపథ్యం నుంచి డాక్టర్ థామస్

డాక్టర్ థామస్ ఇనాళ్లు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అంతరాష్ట్రాలోని మహానగరాల్లో ఆయన వ్యాపార నేపథ్యం ద్వారా ఆర్థికంగా బాగానే ఉన్నారు. ఆయనకి ప్రముఖ వైద్యునిగా గుర్తింపు ఉంది. టీడీపీ నుంచి రాజకీయ ఆరంగేట్రం చేసి జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయనది కార్వేటినగరం మండలం అల్లాగుంట గ్రామం. ఈ దఫా ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించారు.

పోరాట సిద్ధాంతం నుంచి పొన్నా యుగంధర్

పొన్నా యుగంధర్ జనసేన ఆవిర్భావం నుంచి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, స్థానిక సమస్యలపై తనదైన శైలి లో పోరాటాలు చేస్తూ గుర్తింపు తెచ్చుకు న్నారు. ఈయనది కార్వేటినగరం మండలం పాదిరికుప్పం గ్రామం. ఉన్నత విద్య చదువుకున్నాడు. ప్రస్తుత ఎమ్మెల్యే (డిప్యూటి సీఎం) విధానాలు హామీల అమలు గురించి ఎక్కడికక్కడ నిలదీస్తునే ఉన్నారు. నియోజకవర్గ బాధ్యులుగా ఉన్న ఈయన జనసేన నుంచి టికెట్ ఆశించారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కర్ణాటకలోని గౌరీ బిదునూరులో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో మదర్ థెరీసా విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి గెలుపొందారని పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మదర్ థెరీసా సీబీఎస్‌ఈ పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించే కార్యక్రమంలో మదర్ థెరీసా విద్యాసంస్థల చైర్మన్ ఎం.రవీంద్ర బాబు పాల్గొన్నారు. జాతీయస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున మదర్ థెరీసా పాఠశాల విద్యార్థులు 38 మంది కటా, కుమితే విభాగాలలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారని, రెండు విభాగాలలో 14, మొదటి బహుమతులు,12 ద్వితీయ బహుమతులు, 24 మంది విద్యార్థులకు మూడవ బహుమతులతో పాటు ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సాధించినట్లు తెలిపారు. అనంతరం మదర్ థెరిసా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ బాల్య దశ నుండే మానసికంగా శారీరకంగా దృఢంగా ఎదిగేందుకు ఆటలు పోటీలు ఉపయోగపడతాయని, తద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. జాతీయ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ కరాటే మాస్టర్ డాక్టర్ సదాశివను చైర్మన్ రవీంద్రబాబు ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్ పాల్గొన్నారు.

ఘనంగా భారతియార్ భాషోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సుబ్రమణ్య భారతియార్ భాషోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తమిళకవి, స్వాతంత్ర్య పోరాట యోధులు భారతియార్ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్త వేడుకలకు కేంద్రప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో తమిళ విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే పుదుపేట పాఠశాలలో ఉపాధ్యాయులు భాషోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు టివి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. భారతియార్ రచించిన పద్యాలు, గేయాలు విద్యార్థులచే పలికించారు. భారతియార్ వేషధారణలతో విచ్చేసిన విద్యార్థులు అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదమరి: కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల ప్రముఖ కవి, రచయత, సాహిత్య వేత్త సుబ్రమణ్య భారతి జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన గురించి హెచ్.యం. ఎ.పి. లలిత విపులంగా తెలియజేశారు. ఆయన బహు భాష కోవిధుడని, మనకు ఆయన జీవితం ఆదర్శంగా ఉండాలని, భారతియర్ గురించి ఎంతో నేర్చుకోవాలి అని ఆమె అన్నారు. ఆయన గురించి మంజుశ్రీ, నీలవేణి కనకాచారి, మదన్మోహన్, విజయకుమార్, మహేష్ బాబు, షణ్ముగం, నరసింహ రెడ్డి, సుల్తాన్, భాస్కర్ రెడ్డి ప్రసంగించారు.

భావితరాల భవిష్యత్తు కోసమే ఉద్యమం: చలసాని

- హోదా పోరాటానికి సిపిఎం మద్దతు
- వామపక్షాల మీడియా సమావేశంలో కందారపు మురళి

మాట్లాడుతున్న ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): విభజించిన ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని నాడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని బిజెపి ప్రభుత్వం విస్మరించిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి సంతకం ప్రత్యేక హోదా ఫైల్ పై పెడతారని కాంగ్రెస్ తీర్మానం చేసిందని తాము భావి తరాల భవిష్యత్తు కోసమే ఉద్యమిస్తున్నామని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులతో కలిసి చలసాని మాట్లాడారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వకపోగా ఆంధ్రప్రదేశ్ కి రావలసిన పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష యాభై వేల కోట్ల ఖర్చుతో ముంబై నుండి గుజరాత్ కు మోడీ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు తీసుకుపోలేదా ? అని ప్రశ్నించారు. 25 మంది ఎంపీలను ఇస్తే వైసిపి కేంద్రంలోని పెద్దల మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని ప్రకటించి, నేడు అధికారం చేపట్టాక ఆ విషయం గాలికొదిలేశారన్నారు. వారి వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర అభివృద్ధిని, తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టవద్దన్నారు. కులం మతం పేరుతో విభజించి పాలించే బిజెపి సంస్కృతి నుండి ప్రజలు చైతన్యవంతులుగా ఆలోచించి ప్రత్యేక హోదా ఇచ్చే వారికి పట్టం కట్టాలని సూచించారు. ప్రత్యేక హోదా ప్రస్తావించిన వారిని, పోరాడే వారిపై కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదన్నారు. చరిత్ర కలిగిన తెలుగువారిని చిన్న చూపు చూస్తూ తెలుగు నేల అభివృద్ధి చెందకుండా నిరోధకులుగా బిజెపి నాయకుల వ్యవహార శైలి ఉందన్నారు. వైసిపి, టిడిపి, జనసేన కేవలం రాజకీయం కోసం పాకులాడుతున్నారే తప్ప, రాష్ట్ర భావితరాల భవిష్యత్తు కోసం ఆలోచించడం లేదని, పవన్ కళ్యాణ్ ప్రత్యేక హోదా పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రత్యేక హోదా కోసం కలిసి వస్తానని ప్రకటించారన్నారు. ఇందుకు రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రత్యేక హోదా పోరాటానికి మద్దతుగా నిలవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ ఎందరో బలిదానం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలని చూస్తోందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు ఇవ్వలేదన్నారు. చివరికి తిరుమల శ్రీవారి ఖజానాకు ఎసురు పెట్టడానికి శ్రీవాణి ట్రస్టు పేరుతో నగదు బదలాయింపు కుయుక్తి పనులు చేస్తున్నారన్నారు. తెలుగు ప్రజలకు బిజెపి తీరని ద్రోహం చేసిందని, హోదా కోసం హోదా సాధన సమితి పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ కి ఒక సంజీవని అన్నారు. గడిచిన సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, ప్రశ్నించే గొంతుకులను పోలీసు కేసులతో భయపెట్టడం సరికాదన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన సమితి పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధి కోల్పోయిన నిరుద్యోగులు, మేధావులు, మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ బీజేపీ హామీకి తొమ్మిది ఏళ్లు గడిచాయని, ప్రజలు ఇప్పటికైనా ప్రత్యేక హోదా సాధించుకోవడం కోసం కలసికట్టుగా కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు.

వాలంటీర్లకు ప్రచార బాధ్యతలు ఎందుకు?: రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించడానికి ఏర్పాటు చేసిన వాలంటీర్లు ప్రజాప్రతినిధుల ప్రచార బాధ్యతలను ఎందుకు భుజానెత్తుకుంటున్నారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ తిరుపతిలో అభివృద్ధి మాటును జరుగుతున్న అవినీతిపై సిబిఐ ఎంక్వైరీ వేయించుకోవాలని వైసీపీ నేత అజయ్ కుమార్ భూమనను అడగాన్నారు. తిరుపతి నగర పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో రోడ్డు మార్గాలను గుంతలు చేసి విడిచిపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, మోహన్ రాయల్ పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూ తెలుగు విభాగంలో ధర్మనిధి ఉపన్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో మంగళవారం ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. వర్సిటీ సెనేట్ హాల్లో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య జీఎం సుందరవల్లి చేతులమీదుగా ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక సంఘం- మెట్రోపొలిటన్ న్యూయార్క్ పేరుతో ఈ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం జరగనుంది. సంస్కృతి ప్రసార మాధ్యమంగా జానపద విజ్ఞానం అంశంపై హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎన్. భక్తవత్సల రెడ్డి ప్రసంగిస్తారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ కోరారు.